# కోపదారి మొగుడు

రచయిత:

వేరుమళ్ళ కామేశ్వరరావు, బి.ఏ., బి.ఇడి.

[ఇందువచ్చు పాత్రలు : శంకరశాస్త్రి స్కూళ్ళ డిప్టీఇనస్పెక్టరు—చిట్టెమ్మ అతని భార్య - ఆదెమ్మ అతని తల్లి - గోపాలరావు అతని సవతిఅన్నకొడుకు - జగన్నాధము అతని మేనమామ :]

౧

[శంకరశాస్త్రి, ఒక పెద్దమనిషి, గోపాలరావూ భోజనముచేస్తూవుంటారు—చిట్టెమ్మ చారు వెండిగిన్నెలోపోసి శంకరశాస్త్రి విస్తరిదగ్గర పెట్టును—శంకరశాస్త్రి చారు రుచి చూచును.]

శంకరశాస్త్రి—ఉప్పు ఇంట్లోలేదా యేమిటి? అయిపోతే తెమ్మని యేడవరాదూ? ఇంతమంది బంట్రోతులు తగలడుతూవుంటే, ఆమాత్రం చెప్పి తెప్పించలేక పోయావేం.

చిట్టెమ్మ—(మెల్లిగా) ఇంట్లో ఉప్పులేకేం బుట్టెడు ఉప్పుంది.

శంక—అయితే - ఉప్పుండే యిలా తగలేశావూ చారు. నీఅమ్మకడుపు మాడ. (వెండిగిన్నె తన్నును.)

పెద్దమనిషి—అంత కోప్పడకండీ. పొరపాటు.

శంక—పొరపాటేమిటి దాని పిండం.

గోపాలరావు—నాకు చారుపొయ్యి, (చిట్టెమ్మ చారువడ్డించును, గోపాలరావు రుచిచూచును.)

చిట్టె—ఎలాగుందీ ?

గోపా—(ఊరుకుండును)

శంక—ఎలాగుంది. నీశార్ధంలాగుంది, నీపిండాకుడులాగుంది. (కొట్టడానికి లేవబోతూవుంటే పెద్దమనిషి పట్టుకుని ఆపును.)

పెద్ద—కోప్పడకండి, కోప్పడకండి. ఏదో పొరపాటు.

శంక—పొరపాటా దీన్ని తగలెయ్యడం. (కంచెంబు నీళ్ళు చిట్టెమ్మమీద వంచును.)

పెద్ద—ఎంతపని !

గోపా—(తనలో) చారు కేంలోటొచ్చింది. ఈయన మొహం. నామట్టుకు బాగా నేవుంది.

శంక—(పెద్దమనిషితో) ఒక్కచారు మాటే చెప్పావనుకున్నారేమిటి? కూర ఎలా తగలేసిందో చూడండి? ఇప్పటికి లక్షాయాభై సార్లు చెప్పాను తిన్నగా వంటచేసి తగలెయ్ అని. ఇంకా ఎన్ని సార్లు చెప్పేది? చెప్పిచెప్పి నోరు పడిపోతూంది...... ఇప్పుడుకాదు నీపని.

పెద్ద—(తనలో) కూర కేం లోటొచ్చింది! నామట్టుకు బాగా నేవుందే !

శంక—ఇంత మజ్జిగ తగలెయ్యి. ఈ వెధవచారు ఆయనకుకూడా పోసి ఏడవాలేమిటి ? మరెప్పుడూ మనింటికి రాడాబ్రాహ్మడు.

పెద్ద—ఎంతమాటన్నారు ! (చిట్టెమ్మ మజ్జిగ వడ్డించును.)

శంక—ఆవతల చెంబులో నీళ్లేడిసేవా లేదా?

చిట్టె—(మెల్లిగా) పెట్టాను.

శంక—ఏడిశావు. గట్టిగా యేడవరాదూ? గొంతుకంతా ఏ రోట్లో కలిసిపోయింది? ఏడిసిన జాణతనం. (శంకరశాస్త్రి, పెద్దమనిషి లేచి కడుగుతున్నారు.)

చిట్టె—(గోపాలరావుతో) అక్కడే పెట్టాను, తాంబూలం, ఇచ్చెయ్యమ్మా.

గోపా—ఊఁ. (లేచి వెళ్ళును.)

## ౨

[శంకరశాస్త్రి ఎంగిలివిస్తట్లో చిట్టెమ్మ వడ్డించుకుని భోంచేస్తూవుండును—ఆదెమ్మ పిండితింటూవుండును—శంకరశాస్త్రి వచ్చును.]

శంక—నేను నీకు లిన్నగా వంటచెయ్యమని చెప్పానా లేదా? ఆపెద్దమనిషివస్తాడని చెప్పావా? ఏం?...చెప్పు?...చెప్పవేం?

చిట్టె—ఊఁ.

శంక—మాటల్లో తగలడలేవూ?

ఆదెమ్మ—మళ్లా ఏమొచ్చిందిరా?

శంక—నీకేం తెలుసే ముసిలి వెధవగోల......నిన్న బాగా వంటచెయ్యమన్నానా, లేదా? ఇంకా ఎప్పుడు బుద్ధొస్తుంది నీకు? ముందుజన్మకేనా బుద్ధొస్తుందా? చెప్పు? చెప్పవేం? (బుర్రమీద మొత్తును. చిట్టెమ్మ ఒక్క అరుపుఅరిచి కింద పడిపోవును. శంకరశాస్త్రి వెళ్ళిపోవును. గోపాలరావు వచ్చును. కేకలేసుగుంటూ ఆదెమ్మ పిండి దగ్గిరనుంచి లేచివచ్చును.)

ఆదె—అయ్యో! అయ్యో! అయ్యో! చంపేశాడమ్మా! ఇంకేం చేతునమ్మా! మాణిక్యంలాంటి పిల్లని వెధవముండాకొడుకెలాగ కొట్టేస్తాడమ్మా! పీడమ్మ కడుపుకాల.

గోపా—(చిట్టెమ్మ మొహంమీద నీళ్లుచల్లి ఆదెమ్మతో) మరేం ఫర్వాలేదులెండి. ప్రాణంపోలేదు. మూర్ఛపోయింది. అంతే.

ఆదె—బతికిందీ! నాయనా! బతికిందీ! (ఏడ్చును) పీడమ్మకడుపుకాలా! కటికి వెధవ! నాకు వొంట్లో ఓపిక లేదు. డెబ్భైయేళ్లొచ్చాయి. లేస్తే కూచోలేను, కూచుంటే లేవలేను. ఏదో విసుక్కోక, గొణుక్కోక, రోజూసాయింత్రం ఇన్ని నీళ్ళోసుకుని నాకింత పిండిచేసి పెడుతుంది. కన్నకూతురేనా ఇలా చాకిరీ చెయ్యదు. ఈకాలపు కోడళ్ళ లాంటిదికాదు నాయనా! బహు బుద్ధిమంతురాలమ్మా!......అమ్మా! లేచావూ. నా వెర్రితల్లీ! (చిట్టెమ్మను కౌగలించుకుని ఏడ్చును.)

గోపా—అలాగు కొంచెంసేపు కూర్చోనియ్యండి. ఏమీ గొడవ చెయ్యకండి! మళ్లా ప్రాణాలు తిరిగొచ్చాయి......పిన్నీ!......పిన్నీ!

చిట్టె—ఊఁ.

## 3

[శంకరశాస్త్రి కుర్చీమీద కూర్చుండును—చిట్టెమ్మ నిలుచుండును.]

శంక—మీఆమ్మదగ్గిరనుంచి నిన్న ఉత్తరంవచ్చింది.

చిట్టె—ఎప్పుడన్నారు?

శంక—'నిన్న' అని చెప్తే చెవులు లేవేమిటి?

చిట్టె—అయితే నాకిచ్చారుకాలేం?

శంక—నీకొచ్చిన ఉత్తరాలన్నీ నీకే ఇయ్యాలికమోను! మహానాయకురాలివి బయలుదేరావు!

చిట్టె—ఉత్తరంలో ఏముందో అదేనా చెప్పండి పోనీ. ఇంకా యాత్రలు చేస్తూందో, చేసొచ్చిందో?

శంక—ఈవూళ్లోదిగే తుని వెళుతుందిట.

చిట్టె—అయితే ఎప్పుడొస్తుందీ?

శంక—ఇవాళేట.

చిట్టె—చెప్పారుకాలేం!

శంక—అసలు చెప్పవచ్చిం దేమిటంటే, మీఆమ్మతో నువ్వుకూడా ప్రయాణమవాలి. నీకు మళ్లా బాగా బుద్ధొచ్చేవరకూ తీసుకురాను. అంతవరకూ నీపుట్టింట్లోనే వుంచేస్తా.

చిట్టె—(భయపడి) నాకు బాగా బుద్ధొచ్చిందిలెండి.

శంక—ఇంక నువ్వేన్నేడిసినాసరే, చచ్చినాసరే, నీపుట్టింట్లో పడి ఏడవవలసిందే.

చిట్టె—(తనలో) పంపవద్దని ఏడ్చినా లాభంలేదు. (కళ్ళొత్తుకుంటూ) నన్ను పంపించేస్తే మీకు వంటచేసి పెట్టేవాళ్ళెవళ్ళూ? వేళకు భోజనముంటుందా? వంట చెయ్యడానికే నన్నుండనియ్యండి.

318

శంక—(కోపంతో) నిన్ను వెళ్ళమన్నప్పుడు నువ్వు వెళ్ళి తీరవలసిందే. నేను చెప్పిందేమాట. అలా జరిగి తీరాలి.

చిట్టె—అలాగే వెళ్తా. మరి పిల్లలో?

శంక—నువ్వుచేసి తగలడితే నేగాని మాకు పిండా కుడు పుట్టదనుకుంటున్నావు కాబోలు. వెధవనిర్వా కం, వెధవగొడవ. హాయిగా కొన్నాళ్ళపాటేనా సుఖంగా పడివుంటాను!

చిట్టె—పిల్లల్ని నాతో తీసికెళతా.

శంక—పనికిరాదు. వద్దు. నీదగ్గరుంటే ఆవెధవల కేమి సౌఖ్యం, ఇటువంటి వెధవతల్లి మమ్మల్ని కన్నదో అని ఏడవడమేకాని. ఫో, యింక. మూటలు సిద్ధంచేసుకో.

చి—ఇవన్నీ మావాళ్ళదగ్గిర చేరేస్తున్నాననుకుం టున్నా వేమిటి?

శంక—చేరేస్తున్నావో ఏమేడుస్తున్నావో! ప్రయా ణానికి సిద్ధమవు. పాడుపీడ...

చి—ఈవెధవపీడ లేకుండా ఆదేవుడేనా వదిల్చే వాడు కాడమ్మా.

శంక—నేను వదిల్చేస్తానులే. నోరుమూసుకో. ఫో, అవతలికి, ఫో.

౪

[తునిలో చిట్టెమ్మపుట్టిల్లు—చిట్టెమ్మ, గోపాలరావు ప్రవేశిస్తారు.]

చి—ఏమోయి గోపాలం! ఇదేమిటి ఇలాగు వచ్చే వావు?

గో—నీకు తెలియదేమిటి మా బాబుగుణం. నువ్వు వున్నా ఒక్కక్షణముండలేదు, నువ్వు లేకపోయి నా ఒక్కక్షణముండలేదు.

చి—పిల్లలంతా క్షేమంగా వున్నారా? చిన్నవా డేడవడం లేదుకదా.

గో—సరి! ఏడుపేమిటి బొబ్బలెట్టేస్తున్నాడు. వాణ్ణి పట్టుకోడం ఎవరితరం కాకుండావుంది. 'అమ్మా యి! అమ్మాయి!' అని ఒకటే రాగాలు.

చి—(గోపాలరావుకు కనబడకుండా కళ్ళొత్తుకుని) పెద్దవాడు కులాసాగా వున్నాడా?

గో—ఆఁ. వాడే ఇంట్లో పనులన్నీ చూడడం. నేను హోటేలునుంచి భోజనం తీసుకురావడం, వాడు పిల్లలికి తిండి పెట్టడం. కుర్రవాడికేం తెలుస్తుంది పాపం! ఏదో తంటాలు పడుతున్నాడు. పోనీ అంటే అందులో నావు లాంటివా డొక్కడూ లేడు. అంతా నాన్నతంటే వెధవలు.

చి—హోటేలు తిండి పడదు బాబూ చిన్నపిల్లలికి. మన ప్రయాణమా? సాయంత్రం బండికి వెళ దాం.

గో—ఔనుగాని, నేనొకమాట చెప్తావిను. తొందర పడకూడదు దేనికీ కూడా.

చి—ఏమిటో చెప్పు?

గో—మరి రెండురోజులిక్కడే వుండిపో. అప్పుడు మాబాబయ్యకి బాగా రోగం కుదురుతుంది.

చి—మొగాళ్ళతో మనకి పంతమేమిటి నాయనా? ఒకొక్కళ్లు ఒకొక్కమోస్తరుగా వుంటారని వూరుకోవాలిగాని—

గో—అలాగుకాదు. ఆయనికి కొంచెం బుద్ధొస్తుంది. అదీ నేచెప్పేమాట.

చి—వాకూవస్తుంది!

గో—మరయితే వెళ్ళడమే అంటావు.

చి—ఊఁ. సాయంత్రం బండికి పోదాం. పిల్లలు పాపం బెంగపెట్టుకుంటారు.

గో—అయితే సరి అలాగే పోదాం.

౫

[జబ్బుచేత చిట్టెమ్మ మంచంమీద పడు కుని ఉండును, జగన్నాథం, గోపాలరావూ దగ్గిర ఉంటారు,]

జగ—అమ్మాయీ!

గో—లేపించకండి, నిద్ర పట్టిందేమో.

చి—లేదమ్మా! నిద్దరలేదు, మేలుకునేవున్నా.

జ—అమ్మాయీ!

చి---ఊఁ.

జ---నిన్నటికన్న ఒంట్లో తేలిగ్గా అనిపిస్తూందా ?

చి---ఊఁ. ఒకమోస్తరుగా ఉంది.

గో---తేలిగ్గా ఉంటుందన్నాడు వైద్యుడు.

జ---ఫుఁ ఫుఁ. అయితే ఇంక తగ్గుతోస్తూందన్నమాటే.

చి---గోపాలం! బాబూ; పిల్లలు భోంచేశారో లేదో చూసిరా అమ్మా!

గో---అవ్వగారు! తంటాలు పడుతూంది. ఈపాటికి భోంచేసే వుంటారు.

చి---వంటమనిషిని కోప్పడవద్దని చెప్పమ్మా! పిల్లలు తెలియని వాళ్లు.

గో---వంటమనిషి కోప్పతేదేమిటి దాని తలకాయ్!

చి---అబ్బాయీ!

గో---ఫుఁ.

చి---మాతమ్ముణ్ణీ అమ్మని రమ్మని ఓ టెల్లిగ్రాఫుచేసి పెడుదూ.

గో---ఈమాత్రానికే.

చి---అలాకాదు. రమ్మను. పిల్లలినేనా సంతరిస్తారు.

గో---అయితే వేస్తా.

చి---వెళ్ళొచ్చిరా, బాబూ! మొదట.

గో---ఫుఁ. వెళ్తున్నా.

౬

[చిట్టెమ్మ టైఫాయిడ్ జ్వరమువలన చనిపోవును. శంకరశాస్త్రి, జగన్నాథం కూచుంటారు.]

శంక---వన్నిలాగ అర్ధ మధ్యంగా దగాచేసి వెళ్ళిపోతుందనుకోలేదోయి!

జగ---ఏదో దానిఋణం తీరిపోయింది, వెళిపోయింది. అది అదృష్టవంతురాలే.

శంక---కడుపులో ఇంత చిచ్చుపెట్టిపోతుందని కలలోనేనా అనుకోలేదు.

జగ---అంతా హఠాత్తు అనుకోడానికీ మానడానికీ, పథ్యం రోజాలేనా పట్టలేదు.

శంక---ఇంకా ఎంతోకాలముంటుంది. పిల్లలు పెద్దవాళ్ళవుతారు. వాళ్ళకథలూ కార్యాలూ తనే చేయిస్తుంది. నేనున్నా లేకపోయినా తనేనా సుఖపడుతుం దనుకున్నానోయ్! (ఏడ్చును)

జగ---అంతటి నోములు నోచుకోండే. దానికేం సుఖంగానే వెళిపోయింది.

శంక---ఇంతట్లో వెళిపోతుందని తెలియలేదోయి నాకు!

జగ---మరణం చెప్పివస్తుందా ఏమిటి? అంతా మాయ. ఆసూత్రధారు డెప్పటికేంచేస్తాడో ఎవళ్ళం చెప్పలేము.

['కోపదారిమొగుడు' అను పేరుతో నూతనముగా ప్రచురింపబడిన అయిదంకాల సాంఘికనాటకమునుండి ఎత్తబడిన ఘట్టాలు:]

